# ఆ-కలికాలం

"నాకేమైనా కవర్లు వచ్చాయా?" ఆశగా అడిగాడు సత్యం.

"మీరలా అడగడం-రాలేదని చెప్పడం అలవాటైపోయిందండి" పోస్టుమాన్ రామయ్య చెప్పాడు.

"ప్చ్!సరిగా చూడు"

"అక్కరలేదండి-మీకు ఏవైనా ఉత్తరాలు వస్తే అన్నిటికంటే ముందే ఉంచుతాను-అయినా రోజూ ఎవరు రాస్తారు బాబూ నీకు?"

"...ఒక మంచి లెటరు ఇస్తావని ఎదురు చూశాను. కాని...పొరపాటున కూడా ఇవ్వవు కదా?"

"ఓ పని చెయ్యండి. మీరే ఈ రోజు ఓ కవరు రాసి డబ్బాలో పడెయ్యండి-రేపు తెచ్చిస్తాను" నవ్వాడు రామయ్య.

చిర్రెత్తుకొచ్చింది సత్యానికి. "ఆ యాభైపైసలే ఉంటే ఓ టీ తాగనా?" విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

విస్తుపోయాడు పోస్టుమాన్. అది జోకో, నిజమో తెలుసుకోలేక బుర్ర గోక్కున్నాడు.

సత్యం పోస్టుమాన్ తమ వీధికొచ్చేదాకా ఉండలేడు. తనే పోస్టాఫీసుకొచ్చి తమ వీధి పోస్టుమాన్‌ని కలిసి తన పేర వచ్చే కవర్లు తీసేస్కుంటాడు. అతి ముఖ్యమైనవి ఉంటే ఓ గంట ఆలశ్యంగా ఎందుకు తీసుకోవాలి అని అతని ప్రశ్న.

ఎంతో ఆశగా అంతదూరం నడిచి వచ్చిన సత్యానికి ప్రాణం చివుక్కుమంది. అతనుసగటు నిరుద్యోగి. చదువు డిగ్రీ! ఒకప్పుడు ఓ మాదిరిగా బ్రతికేవాడు. కాని కనిపించిన ప్రతి ఉద్యోగ ప్రకటనకూ దరఖాస్తు పడేసిపూర్తిగా బీదవాడైపోయాడు.

ప్రతి వెధవ ఉద్యోగానికి కొద్దోగొప్పో రుసుం పంపాలి. దానికితోడు ఆకాశమంటిన తపాలా ఖర్చులు...పొరపాటున ఇంటర్వ్యూకు పిలిచారో ఇక గ్రహపాటే! వందో రెండొందలో చేతి చిలుం వదులుతుంది.

ఒకటి రెండు టెంపరరీ పోస్టులు చేసినా అవి అతని ఆకలిని అవసరాల్ని ఆదుకున్నవి కావు.

అశోకా హోటలు దగ్గర నిలబడ్డాడు.

డబ్బులుంటే అది ఫైరింజన్- ఆకలి మంటలు ఆర్పడానికి. కడుపునిండా భోంచేసి వారం అయింది. ఓ బ్రెడు, టీ, త్రాగి ఇరవైనాలుగు గంటలు దాటింది.

స్నేహితుల దగ్గిర అప్పు పుట్టించడంలో అతను ఘోరంగా విఫలమైనాడు. ఇంటినుంచి వస్తుందనుకున్న మనియార్డరు రాలేదు. ఇంకా చాలారోజులు పట్టవచ్చు.

చిన్నాచితకా ఉద్యోగాలకోసం ప్రయత్నించి అలసిపోయాడు.

మరీ కక్కుర్తిపడి చిన్న పనికి ఒప్పుకున్నా 'శ్రమ' దోపిడీ' తప్ప ఫలితం శూన్యంగా ఉంది.

కాళ్ళు పీకుతున్నాయి. నరాలు తోడేస్తున్నాయి. తల దిమ్ము ఎక్కుతోంది.

దూరంగా పెళ్ళి బాజాలు వినిపిస్తున్నాయి. రంగు రంగు బల్బులు...అట్టహాసాలు కనిపిస్తున్నాయి. ఎవరిదో పుర ప్రముఖుడి తాలుకు సంతానం పెళ్ళిలాగుంది. కార్లు, స్కూటర్లు, రిక్షాలు...హడావిడిగా ఉంది.

ఆకలి నీతి ఎరుగదు.

సత్యం-ఆత్మారాముడి క్షోభకు తలవంచి అటువైపు అడుగులు వేశాడు.

"సునీతా వెడ్స్ సురేష్"

ధైర్యం చిక్కబట్టుకుని నలుగురితోపాటు లోపలికి అడుగులు వేశాడు.

రిసెప్షన్ దగ్గర అందమైన అమ్మాయి నించుని ఆహ్వానిస్తూ గులాబీ పువ్వు ఇస్తున్నది.

లేని హుందా తెచ్చుకుని పువ్వు అందుకుని ముందుకు సాగాడు.

ఆమె అదోలా అతన్ని చూడ్డం అతనిలో కొంచెం కంగారు పుట్టించింది.

కొంపదీసి ఆమె కనిపెట్టలేదు కదా ఆహ్వానితుడు కాడని అతిథి అని.

గుంపులో గోవిందా! ఇటువంటి సమయాల్లో సిగ్గు, మొహమాటం పనికిరావు.

కుర్చీలో చివర ఖాళీ ఉంటే కూర్చున్నాడు.

కళ్యాణమండపం వైభవోపేతంగా ఉంది. కొన్ని వేలు కేవలం పూల అలంకరణకే ఖర్చు చేశారు. పూలపందిరి పెళ్లి పందిరి.

ఆ సమయంలో గుర్తు రాకూడదు.. కాని గుర్తుకు వచ్చింది- సత్యానికి- ఘంటసాల పుష్పవిలాపం.

కరుణశ్రీ ఆ పూల వెల్లువ చూస్తే ఏమని కన్నీటి పూలజల్లు కురిపించేవాడో.

కేవలం ఓ కన్నె కలలపంట కోసం- వేవేల కన్నె కుసుమాలు కన్నీట కరిగాయి- పన్నీట మునిగాయి.

"ముహూర్తం ఎన్ని గంటలకు?" సత్యం తన పక్క నున్న ఆసామిని చూసి అంచనా కట్టి అడిగాడు. అతను పెద్దమనిషిలా కనిపిస్తున్నాడు.

"ఏమో...పన్నెండు కాబోలు."

అతను జేబులోంచి కార్డు తీశాడు.

సత్యం చొరవతీసుకుని ఆ కార్డు తీసుకుని చదివాడు."సత్యనారాయణ కుమార్తె సునీతను- రాఘవేంద్రరావు కుమారుడు సురేష్‌కు వివాహం శుభముహూర్తం'12' గంటల '10' నిముషాలకు.

పెళ్లితో పాటు భోజనాలు కూడా జరుగుతున్నాయని గ్రహించడానికి అతనికి ఎంతో సేపు పట్టలేదు.

తన పక్కనున్న పెద్దమనిషి అవతలి చిన్న మనిషితో మాట్లాడ్డం గమనించి కార్డు జేబులో పెట్టుకుని భోజనాలశాల వైపు వెళ్లాడు.

అంతా సంస్కారవంతులు- ఖరీదైన వాళ్ళు-చదువుకున్నవాళ్లు- అన్నీ ఉన్నవాళ్ళు..తిండికి తొందరపడుతున్నారు. ఎక్కడ సీట్లు అయిపోతాయోనని గబగబా ఆత్రంగా కుర్చీలు లాక్కుని కూర్చుంటున్నారు.

సత్యం తనకూ సీటు సంపాదించుకున్నాడు.

వడ్డన ప్రారంభమైంది. వేసినవి వేసినట్లే తినేశాడు. కాస్త ఆకలి తీరింతరువాత అనుమాన మొచ్చింది. తనను ఎవరైనా గమనిస్తున్నారా అని. పంక్తిలో అన్నీ వడ్డించిన తరువాత కదా భోజనం చేయడం మొదలెట్టేది అని. బిత్తర బిత్తరగా చుట్టూ చూశాడు... కాని అక్కడ పెద్దమనుషులు ఎవరూ అటువంటి సాంప్రదాయాలు పాటించడంలేదు, ఎవరిపాటికి వారు- వేసిందే తడువుగా తింటున్నారు.

చాలాకాలం తరువాత తృప్తిగా భోంచేసి, కల్యాణం జరుగుతున్న హాల్లోకి వచ్చాడు.

తలంబ్రాలు జరుగుతున్నాయి.